05ATP26_05ATP26.qxd 26-05-2023 PM 11:52 Page 1



# అర్హులైన ప్రతి లబ్దిదారునికి సంక్షేమ పథకాలు అందాలి

## - మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి, జెడ్‌పిటిసి పిలుపు

అమడగూరు, మే 26 ప్రభాతవార్త

అర్హులైన ప్రతి లబ్దిదారునికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై వుందని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జెడ్‌పిటిసి కవితలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి గజ్జల ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. మొదట మండలంలోని అన్ని శాఖల వారిగా చేపట్టిన పనులను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి కవిత, ఎంపిపి ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి లబ్దిదారునికి పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చని పేర్కొన్నారు. జెకెపల్లి ఎంపిటిసి నాగరాజు మాట్లాడుతూ జెకెపల్లి గ్రామ రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న భూ పంపిణీలో దాదాపు 90 మంది రైతులు తమ భూములను గత కొన్ని రోజులుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సాగు చేస్తున్న రైతులను గుర్తించడంలో వెనుకంజవేస్తున్నారని వెంటనేసాగుచేస్తున్న రైతులకు భూపంపిణీలో పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేవారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ రెండు మూడు రోజుల్లో సర్వేయర్‌ను గ్రామాలకు పంపి అర్హులైన ప్రతి రైతును గుర్తించి భూ పంపిణీలో భూమిని ఇచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు. మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లు నిర్మించుకొని నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయడంలో హౌసింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు హౌసింగ్ ఎఇని నిలదీశారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్లకు సిమెంట్ సరఫరా ఎందుకు చేయడంలేదని ఎఇని వారు ప్రశ్నించడంతో ఏఇ నీళ్లు నమిలారు. సిమెంట్ ఇచ్చేంతవరకు సిమెంట్‌పై స్పష్టమైన హామి ఇవ్వాలని పట్టుపట్టడంతో వారంలోగా అందరికి సిమెంట్ పంపిణీ చేస్తామని హౌసింగ్ ఎఇ తెలపడంతో సభ్యులు శాంతించారు. మండల వ్యవసాయాధికారి వీరజ్యోత్స్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనకాయలు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో మంజూరు చేసిందని మండలానికి 4013 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించిందని రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసిందన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 29వతేదీన రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామన్నారు. వైద్యాధికారిణి అపర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందరికి ఆరోగ్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అనే పథకాన్ని తీసుకొచ్చిందని ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రతి గ్రామ సచివాలయంలోని గ్రామాల్లో వైద్యసిబ్బంది నెలకు మూడుమార్లు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి పరీక్షించిన అనంతరం మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఏపిఓ అమరావతి మాట్లాడుతూ మండ లంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా 2006 మంది కూలీలు పనిచేస్తున్నారని వీరికి ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నా మన్నారు. అలాగే పండ్లతోటలు పెంపొం దించేందుకు ప్రభుత్వం పండ్ల తోటల ప్రోత్స హించేందుకు ఎకరాకు 2400 రూపాయలను అందిస్తోందని ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టుపరిశ్రమ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టు పరిశ్రమను పెంపొందించేందుకు పట్టు రైతుకు ఎకరాకు 18700 రూపాయల చొప్పున ప్రభుత్వం రేషన్ మొక్కలు పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఎకరాకు 5 వేల మొక్కల చొప్పున ఒక్కొక్క మొక్కకు నాలుగు రూపాయల చొప్పున ప్రభుత్వం అందచేస్తోందన్నారు. అలాగే రేషన్ షెడ్డు నిర్మాణం కోసం మూడు లక్షల రూపాయలు ప్రభుత్వం జాతీయ ఉపాధి హామి పథకం కింద మరో ఒక లక్ష రూపాయలను మంజూరు చేస్తోందని పట్టుపరిశ్రమ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏపిఎం గోపాల్ మాట్లాడుతూ మండలంలో వైఎస్ఆర్ క్రాంతి పథకం కింద సంఘాలకు 4300 మంది సభ్యులకు ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా ద్వారా మూడు కోట్ల 99 లక్షల రూపాయలను మహిళల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఈ కార్య క్రమంలో మండల సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, తహశీల్దార్ నందిని, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ, సరస్వతమ్మ, నరసమ్మ, ఎంపిటిసిలు నాగరాజు, శ్రీరాములు, పెద్దప్పయ్య, లక్ష్మీపతి, సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సుమియా, సచివాలయం ఉద్యోగులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పిటిసి కవిత

# ఉచితంగా గొర్రెల మందులు పంపిణీ

## - ఆపన్నహస్తం అందిస్తున్న గడ్డం రాజగోపాల్

ముదిగుబ్బ, మే 26 ప్రభాతవార్త

మండలంలోని సాయగట్టుపల్లి, దిగువపల్లి, టిఎన్‌పాళ్యం, మల్లేపల్లి గ్రామా ల్లో శుక్రవారం ధర్మవరం నియోజకవర్గం సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ దాదాపు 35 లక్షల రూపాయల విలువ చేసే గొర్రెల మందులను గొర్రెల కాపరులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గడ్డం రాజగోపాల్ మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు భూమి వున్నా వ్యవసాయంలో గిట్టుబాట ధర చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించుకుని గొర్రెల పెంపకంపై దృష్టి సారించాలని నిరుపేద రైతులు గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని అయితే ప్రస్తుతం గొర్రెలకు సీజనల్ వ్యాధులు వస్తుండడంతో గొర్రెలు మృతి చెందడం జరుగుతోందని ఈ విషయం తెలుసుకుని గొర్రెల కాపర్లు నష్టపోకుండా వారికి ఆపన్నహస్తం అందిస్తూ లక్షలాది రూపాయల విలువ చేసే మందులను స్థానిక పశువైద్యాధికారి సమక్షంలో పంపిణీ చేస్తున్నామన్నారు. వారు ఆర్థికంగా నష్టపోకుండా చేయూతనిస్తూ తనవంతు సాయంగా ఈ కార్య క్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలి పారు. ప్రస్తుతం ఆర్థికంగా చితికి పోతున్న గొర్రెల కాప రులకు ఆర్థిక స్థితి బాగుపరి చేందుకు అదేవిధంగా మూగ జీవాల సంక్షరణే ధ్యేయంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లో సరైన మందులు అందుబాటు లో లేక చిన్నచిన్న రోగాలకే మృత్యువాతపడుతున్నాయని గొర్రెల కాపర్లు తీవ్రంగా నష్టపోవడం జరుగుతోందన్నారు. మున్ముందు ప్రతి గ్రామంలోను ఈ మందులను ఉచితంగా అందుబాటులోకి తేవాలనే లక్ష్యంగా పనిచేస్తున్నా మన్నారు. ప్రతి గొర్రెల కాపరి ఈ మందుల కిట్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకుని గొర్రెలు మృత్యువాత పడకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.


మందులు పంపిణీ చేస్తున్న గడ్డం రాజగోపాల్

# రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ఓబుళదేవరచెరువు, మే 26, ప్రభాతవార్త : మండల పరిధిలోని గాజుకుంటపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజుకుంటపల్లి గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి కుమారుడు సుదర్శన్‌రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఓడీచెరువు వైపు నుంచి ట్రాక్టర్ వస్తోందాన్నరు. సుద ర్శన్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో ఓడిసి వైపు వెళుతుండగా వ్యవసాయ గోదాము వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీ కొందన్నారు. ఈ ఘటనలో యువకుడి తలకు బలమైన గాయం తగలండంతో రక్తస్రావం అయిందన్నారు. గాయపడ్డ సుదర్శన్‌రెడ్డిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడ్డ యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు సమాచా రం.



గాయపడ్డ సుదర్శన్‌రెడ్డి

# భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

ఓబుళదేవరచెరువు, మే 26, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఇనగళూరు పంచాయితీ మజారా రామిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామదేవత శ్రీ గంగమ్మతల్లి దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రామ్మూర్తి బృందం వారిచే హోమం, కలశపూజలు, కంకణాలు, పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారి విగ్రహం ప్రాణప్రతిష్ట స్థాపన చేసి కాయ కర్పూరం, నైవేద్యం సమర్పించారు. అనంతరం మహామంగళహారతి, నీరాజన దర్శనం, భక్తులకు తీర్థ, అన్నదానప్రసాద వినియోగం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, గ్రామప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గ్రామస్తులు

# సుధా క్రాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం రూ.48.55 కోట్లతో టెండర్ ఆహ్వానం


బళ్లారి సుధా క్రాస్ నూతన రైల్వే ఫ్లై ఓవర్ స్కెచ్ నమూనా ఇదే

బళ్లారి, మే26, ప్రభాతవార్త ; బళ్లారి నగరంలో అతి రద్దీ ప్రాంతంగా ఉన్న సుధాక్రాస్‌లో బళ్లారి-హొస్పేట రహదారికి అడ్డంగా ఉన్న రైలుమార్గం కారణంగా నిత్యం ట్రాఫిక్ స్తంభనతో సార్వజనికులు ఇబ్బందికి గురయ్యేవారు. రైళ్ల రాకపోకల నేపథ్యంలో అరగంటకోసారి సుధాక్రాస్ రైలుగేట్లు వేస్తుండడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి రైళ్ల పోయేంతవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నిరంతరంగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ రైలు మార్గంపై ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలన్న ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. పలుమార్లు రైల్వే ఫ్లై ఓవర్‌పై అంచనా వ్యయానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.48.55 కోట్ల నిధులు మంజూరు చేయడంతో జిల్లా పాలనా యంత్రాంగం టెండర్లు ఆహ్వానించింది. నగర ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న సుధా క్రాస్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడుగులు పడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఓపీడీ సర్కిల్ నుంచి ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రారంభమవడంతో ఓపిడీ ఆస్పత్రి సర్కిల్ నుంచి ప్రారంభమై టీబీ శానిటోరియం వరకు ముగుస్తుంది. ఫ్లై ఓవర్ కింద సర్వీసు రోడ్డును కూడా నిర్మిస్తారు. హొస్పేట నుంచి వచ్చే వాహనాలు కునంపునగర్ మీదుగా వచ్చి ఓపిడీ సర్కిల్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక, సాంకేతిక టెండర్లు ఆహ్వానించినట్లు, జూలై 7న టెండర్లు ఓపెన్ చేసి నిర్మాణ పనుల కార్యం జరుగుతుందని జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వపు నిర్మాణ పనులు అయినందున ఎటువంటి ఆటంకం లేకుండా 2025లోగా సార్వజనికుల సేవకు ఈ వంతెన ఉపయోగంలోకి రానున్నది.

# ఉపాధి పనుల పరిశీలన

కదిరి టౌన్, మే 26 ప్రభాతవార్త

రూరల్ మండల పరిధిలోని మద్దన్నగారిపల్లి, బురుగు పల్లి, అప్పవాండ్లపల్లి గ్రామాల్లో చేస్తున్న ఉపాధి పనులను శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఉపాధి క ఊలీలతో మాట్లాడి వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అరటిపల్లు, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి

# బళ్లారి ప్రజలకు వినోదం పంచే రెయిన్‌బో ఎగ్జిబిషన్

బళ్లారి, మే26, ప్రభాతవార్త ; బళ్లారి నగర ప్రజలకు వినోదం పంచే రెయిన్‌బో ఎగ్జిబిషన్ నగరంలోని ఐటీఐ కాలేజీ మైదానంలో ప్రారం భమయ్యింది. సార్వజనికు లు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి పిల్లలకు ఆటలాడుకునేందుకు అనేక ఐటెమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే వస్త్రాల దుకాణాలు, మహిళల కోసం గృహోపకరణాల స్టాల్స్, దుస్తుల షాపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ప్రధాన ఆకర్షణగా వాటర్‌బోట్, ఎయిర్‌బెలూన్, ఎగ్జిబిషన్ ముందు భాగంలో భారీగా ఆహ్వానం పలికే కింగ్‌కాన్ గొరిల్లా చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఎగ్జిబిషన్‌లో సుమారు 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు, వివిధ చేతివృత్తుల తయారీ వస్తువుల విక్రయంతో పాటు ప్రత్యేకంగా వివిధ రకాల పక్షుల పార్కు ఈసారి ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని తెలిపారు. కృత్రిమ పక్షులైనా ప్రత్యేక మిషన్‌లతో అవి రెక్కలు విప్పేలా, తల ఊపేలా నిజమైన పక్షుల మాదిరిగా అరుపులతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పక్షుల ధ్వనులను కూడా ఈ సందర్భంలో చూపరులను ఆకర్షిస్తాయని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆహార మేళా ఉంటుందని, 15 రకాల వివిధ అమ్యూజ్‌మెంట్ గేమ్‌లు ఉంటా యని, ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుము కేవలం రూ.70 మాత్రమేనని తెలిపారు. ఎగ్జిబిషన్ ప్రదర్శనకు అవసరమైన అన్నిశాఖల అధికారుల అనుమతి పొందినట్లు తెలిపిన విజయ్‌విల్సన్, జూన్ 11వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ బళ్లారి ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అవసరమైతే మరికొన్ని రోజులు విస్తరించే అవకాశం ఉంటుందని చెప్పారు. బళ్లారి నగర ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి చక్కటి వినోదం పొందాలని హాజరైన జనతాబజార్ మాజీ అధ్యక్షుడు వి.ఎన్.బసవరాజ్ తెలిపారు. ఈ సందర్భంలో మేనేజర్ అమిత్, రియాజ్‌అహ్మద్, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెయిన్‌బో ఎగ్జిబిషన్ యజమాని విజయ్‌విల్సన్... ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్ ప్రవేశ ద్వారం

# నరకమే నయం..!

## ః కన్నెత్తి చూడని యాజమాన్యం..కనిపించని మానవత్వం..!

తాడిపత్రి,మే 26 ప్రభాతవార్తః తల్లి, భార్య, ముగ్గురు పిల్లలకు షెక్షావలే పెద్దదిక్కు. తల్లి ఆసుపత్రిలో సేవచేయగా వచ్చిన అరకొర డబ్బుతో పాటు అతను చోదక వృత్తి చేస్తూ సంపాదించే సంపాదనే ఆ కుటుంబానికి ఆధారం. ఈ క్రమంలో యాడికి పీహెచ్‌సీలో నివశిస్తున్న షెక్షావలి ఈ నెల 24న టిప్పరు నడుపుతూ పెద్ద ప్రమాదానికి గురవడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. పెద్దపేటకు చెందిన ఓ టిప్పరు యజమాని రోజుకు రూ. వెయ్యి భృతిగా ఇస్తానని చెప్పడంతో క్రిష్టిపాడు సమీపంలోని ఓ ఫ్యాక్టరీ వద్ద ఖనిజపు రాయిని తరలించేందుకు వెళ్లాడు. ఖనిజాన్ని దింపుతుండగా వాహనం పైనున్న విద్యుత్తు తీగలు టిప్పరుకు తగలి తెగిపడటంతో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ప్రమాదం నుంచి తప్పించుకోలేక పోయిన షెక్షావలి చేతులు, వీపు, కాళ్లు కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. తల్లి, భార్య, పిల్లలు కన్నీరు మున్నీరవుతూ అనంతపురం ప్రభుత్వ ఆసుత్రికి చేరుకున్నారు. వారి చేతిలో రూ. 1,500 లు ఉంచి ఒక యజమాని అక్కడి నుంచి జారుకున్నాడు. షెక్షావలి తల్లి వైద్యశాఖలో పనిచేస్తున్న పరిచయంతో కొందరు వైద్యులు శ్రద్ధగా చూస్తున్నప్పటికీ ఇప్పటికే వారు దాచుకున్న రూ 15 వేలు ఖర్చయి పోయాయి. విధిలేక ఒక చేయిని వైద్యులు తొలగించారు. మరో రెండు రోజుల్లో రెండు కాళ్లు తొలగించాల్సి ఉంటుందని వైద్యులు తెలపడంతో తల్లి, భార్య, పిల్లలు బోరున విలపిస్తున్నారు. మాన వత్వం మరచిన యజమానులు తమ గోడు పట్టించుకోవడం లేదని, కళ్లెదుటే అచేతనంగా మిగిలి పోయిన షెక్షావలిని ఎలా పోషించుకోవాలని ఆ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ?ఆ ప్రమాదం జరిగిన చోటికి ఇతర టిప్పరు యజమానులెవ్వరూ పనికి పోకున్నా అక్కడికి పోయి ప్రాణాలమీదికి తెచ్చుకున్నానని షెక్షావలి కుమిలిపోతున్నాడు.


చర్మం కాలి తీవ్రంగా గాయపడిన షెక్షావలి


చేయిని కోల్పోయి,,రెండు కాళ్లను కోల్పోనున్న షెక్షావలి

# ఆలయ ప్రహరీ నిర్మాణానికి విరాళం

యాడికి(తాడిపత్రి), మే 26, ప్రభాతవార్తః యాడికి మండలం లక్షుంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న రామాలయ ప్రహరీ నిర్మాణానికి స్వచ్ఛంద సేవకులు సీవీ రమణారెడ్డి విరాళం అందజేశారు. లక్షుంపల్లి గ్రామ చివరలో ఐకమత్యంతో తాము నిర్మించుకుంటున్న రామాలయ ప్రహరీ నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాల్సిందిగా గ్రామస్థులు కోరగా స్పందించిన సీవీఆర్ రూ. 1.5 లక్షలు వారికి అందజేశారు. ప్రశాంత వాతావరణంలో రామాలయం నిర్మిస్తున్నారని, గ్రామం కూడా ప్రశాంతంగా, పచ్చగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మీదేనని గ్రామస్థులతో సీవీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్షుంపల్లి సర్పంచి పద్మనాభరెడ్డి, శివకేశరెడ్డి, గ్రామస్థులు బలరాముడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


లక్షుంపల్లి గ్రామస్థులకు విరాళ ౦మందజేస్తున్న సీవీ రమణారెడ్డి

# చావుకు ఏడవాల్సిందే..దారికీ ఏడవాల్సిందేనా..!

యాడికి(తాడిపత్రి), మే26, ప్రభాతవార్తః తాము ఇంకెంత కాలం చచ్చిన మనిషి కోసం..ఆ మనిషిని తీసుకెళ్లే దారి కోసం ఏడవాలని సి.లక్షుంపల్లికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు తహసీల్దార్ అలెగ్జాండర్‌తో మొరపెట్టుకున్నారు. లక్షుంపల్లి ఆర్డీటీ కాలనీలో నివాసముంటున్న ఎస్సీ కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే వారి మృతదేహాలను శ్మశాన వాటికకు తరలించేందుకు మా ర్గం లేక నానా అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రా మం నడిబొడ్డున పోవాలంటే ఆచారం అడ్డొస్తోందని, గత మార్గంలో వెళ్లాలంటే కొందరు రైతులు అడ్డొస్తున్నారని వారు వాపోయారు. 2019లో అప్పటి తహసీల్దార్ ఎదుట శ్మశాన మార్గానికి సంబంధించి 4 అడుగుల వెడల్పుతో దారి ఏర్పాటుకు అంగీకరించారని, ప్రస్తుతం తిరిగి అడ్డంకులు సృష్టిస్తున్నారని కొందరు రైతులపై వారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేస్తామని తహసీల్దార్ పేర్కొనడంతో గ్రామస్థులు వెనుదిరిగారు.


బాధితుల వినతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అలెగ్జాండర్

# బిజెపి మండల కార్యవర్గ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షులు పొట్టే గంగాధర్

యాడికి, మే 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షులు గంగాధర్ ఆధ్వర్యం లో మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార ్యక్ర మానికి ము ఖ్యఅ తిథులుగా రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, తాడిపత్రి అసెంబ్లీ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, తాడిపత్రి పట్టణాధ్యక్షులు మైదుకూరు ఆంజనేయులు పాల్గొన్నారు. ఇందులో పలు అంశాలపై చర్చించారు. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో 9 ఏళ్ల ప్రధాని మోడి పాలన గురించి, సంక్షేమ పరిపాలన, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియచేయాలని తీర్మానించారు. ఇందులో యాడికి పట్టణానికి చెందిన క్రియాశీల సభ్యులు వద్ది రాజశేఖర్‌ను మండల ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్య క్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి పందు లక్ష్మీదేవి, మహిళా మోర్చ అధ్యక్షురాలు కళావతి, ఉపాధ్యక్షులు దాసరి జయరాముడు, ప్రధాన కార్యదర్శి చింత చౌదయ్య, కిసాన్‌మోర్చా అధ్యక్షులు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాగశేఖర్, ఒబిసి మోర్చా అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి కృపాకర్, ఎస్‌టి మోర్చా అధ్యక్షులు పెనుకొండ రామ్మోహన్, మండల కోశాధికారి శ్రీనివాసులు, బిజెవైఎం కార్యదర్శి హరీష్, హరిప్రసాద్, కార్యదర్శులు దస్తగిరి, నరసింహులు, రవినాథ్, ప్రసాద్, కొండయ్య, మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేపై గ్రామసభలు


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుట్లూరు, మే 26 ప్రభాతవార్త

మండలంలోని అర్కటివేముల గ్రామంలో భూ రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని అర్కటివేముల, సూరేపల్లి, దోసలేడు, మడుగుపల్లి గ్రామాల్లో రీ సర్వే మొదలు పెట్టాలని జిల్లా సంయుక్తకలెక్టర్, అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు రీ సర్వేకు సంబంధించి ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి త్వరలోనే రోవర్స్ అందిన వెంటనే రీ సర్వే మొదలు పెడతామన్నారు. ఇందులో భాగంగా అర్కటివేముల గ్రామంలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్య క్రమంలో అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి, డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అనంతపురం, తహశీల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.


# జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం యువసేన ఆధ్వర్యంలో రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న యువసేన కార్యకర్తలు

యాడికి, మే 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం యువసేన ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ, రాస్తారోకో చేశారు. యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గత 30 సంవత్సరాలుగా పలు సంఘాల నాయకులు, వివిధ పోరాటాలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ రామాంజి నేయులు, వెంకటేష్‌నాయక్, పవన్‌కుమార్‌రెడ్డి, శివలు అక్కడికి చేరుకుని సమస్య వుంటే అధికారులకు విన్నవించుకోవాలని ఇలా రాస్తారోకో నిర్వహించరాదని వారించారు. కళాశాల ఏర్పాటు చేయాలని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులను కోరారు. ఈ కార్య క్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేత రాయలచెరువు జట్టు


గెలిచిన రాయలచెరువు జట్టుకు నగదు ప్రదానం చేస్తున్న దృశ్యం


బెల్ట్‌ఫీల్డర్‌గా ఎంపికైన కెప్టెన్ శేఖర్

యాడికి, మే 26 ప్రభాతవార్త

మండలంలోని పుప్పాలతాండాలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం రాయలచెరువు, పుప్పాల జట్ల మధ్య జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో రాయలచెరువు జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో రాయలచెరువు జట్టు నిర్ణీత ఓవర్లలో 124 పరుగులు చేయగా అనంతపురం బ్యాటింగ్ చేసిన పుప్పాలతాండా జట్లు 112 పరుగులు మాత్రమే చేసింది. దీంతో రాయలచెరువు జట్టు 12 పరుగుల తేడాతో గెలిచింది. రాయలచెరువు జట్టులో కెప్టెన్ శేఖర్ 50 పరుగులు చేయడంతో పాటు 6 వికెట్లు సాధించి మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్, మ్యాన్‌ఆఫ్‌ద సిరీస్ సొంతం చేసుకున్నాడు. గెలుపొందిన రాయలచెరువు జట్టుకు నిర్వాహకులు త్రినాథ్‌రెడ్డి నాగమునిరెడ్డి, లక్ష్మానాయక్, రామునాయక్ చేతుల మీదుగా అందచేశారు.

# నేడు వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం

యల్లనూరు, మే 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు వాలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ కొండన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం చేత ఎంపిక కాబడిన యల్లనూరు మండలం గ్రామ వాలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ఆయన చేతుల మీదుగా అందచేయడంతో పాటు సన్మాన కార్యక్రమం నగదు ప్రోత్సాహకం అందచేయడం జరుగుతుందన్నారు. కావునా మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు హాజరు కావాలని ఎంపిడిఓ కోరారు.

# సమగ్ర భూసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం - ఆర్‌డిఓ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఓ

యల్లనూరు, మే 26 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు ఆర్‌డిఓ మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 85 నిట్టూరు గ్రామంలో సమగ్ర భూ సర్వేలో భాగంగా రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే ఎంతో ఉపయోగకరమన్నారు. రైతులకు పొలం హద్దుల వద్ద ఏవైనా సమస్యలు వుంటే ఈ సర్వేలో సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమశీల్దార్ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

